సాక్షి
చిత్తూరు
బుధవారం । 18 । డిసెంబర్ । 2024



స్కూల్ ప్రహరీ కూల్చివేత
పలమనేరు మండలం చిన్నపేట కురుప్పల్లి ప్రభుత్వ పాఠశాల ప్రహరీని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. - 8లో



అట్టహాసంగా ఇంటర్ స్పోర్ట్స్
పలమనేరు బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ప్రారంభమయ్యాయి. - 8లో



గ్రామాల అభివృద్ధే లక్ష్యం
గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

సౌత్‌జోన్ ఫుట్‌బాల్ టోర్నీకి నగరి విద్యార్థి



విద్యార్థిని ప్రశంసిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

నగరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో థర్డ్ ఇయర్ బీఎస్సీ చదువుతున్న విద్యార్థి శివరాజ్ ఇటీవల జరిగిన ఇంటర్ కొలిగేట్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరచి సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. ఈ నెల 21 నుంచి 29 వరకు కేరళ రాష్ట్రం కాలికట్ విశ్వవిద్యాలయంలో జరిగే పోటీల్లో పాల్గొంటాడన్నారు. విద్యార్థిని మంగళవారం కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ రెడ్డినాయక్, డాక్టర్ భాస్కర్, పీడీ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సోలార్ పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్


చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో సోలార్ ఫలకాల ఏర్పాటు పనులు వేగవంతంగా చేయాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. మంగళవారం ఎస్ఈ కార్యాలయంలో అధికారులు, వెండర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో సూర్యఘర్ పథకానికి 2వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. కాగా అందులో 156 పనులు పూర్తికాగా, 186 పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. సోలార్ ఫలకాలు వేగవంతంగా బిగించాలని ఆదేశించారు. అధికారులు నెట్‌మీటర్లను త్వరగా అందించాలని, ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ, వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. వినియోగదారులకు అంతరాయం లేని సరఫరా అందించడానికి కృషి చేయాలని సూచించారు. లైన్ నిర్వహణ పాటిస్తూ, సబ్‌స్టేషన్లను తనిఖీ చేస్తుండాలన్నారు. శాఖాపరంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమంలో వస్తున్న సమస్యలను సకాలంలో పరిష్కారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈలు జగదీష్, మునిచంద్ర, సురేష్, శ్రీనివాసమూర్తి, ఏఓ ప్రసన్నంజనేయులు, పీఓ రెడ్డెప్ప, డీఈలు ప్రసాద్, ఆనంద్, శేషాద్రి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పాడికి మందులు అందజేత

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం దర్గా సర్కిల్‌లోని పశు వైద్యశాలలో మంగళవారం పాడి సంబంధిత మందుల పంపిణీని జేడీ ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం, చలికాలంలో పాడి పశువులకు పలు రకాల వ్యాధులు వస్తుంటాయన్నారు. మందులను వినియోగించి పాడి సంరక్షణకు పాటు పడాలని, వీటిని వృథా చేయొద్దని సూచించారు.

సామాన్యుడికి కరెంట్ షాక్

గత ఎన్నికల ప్రచారంలో ఐదేళ్ల పాటు విద్యుత్ చార్జీలు పెంచమని పదేపదే ఊకదంపుడు ప్రసంగాలు ఇచ్చిన చంద్రబాబు అప్పుడే ప్రజలపై కక్షపూరిత చర్యలకు దిగాడు. ఆయన మోసపూరిత మాటలు నమ్మి ఓట్లేసిన ప్రజలకు ఇప్పుడు కూటమి ప్రభుత్వం విద్యుత్‌చార్జీల రూపంలో షాక్ ఇస్తోంది. ఆర్నెల్లకే విద్యుత్ భారం మోయలేమంటూ రాష్ట్రప్రజలపై ఏకంగా రూ.15 వేల కోట్లు మోపేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా ఈ నెల ప్రజల నడ్డి విరిచేలా కరెంట్ బిల్లులు షాక్ కొడుతున్నాయి.



- ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచమంటూ చంద్రబాబు హామీ
- అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లకే బాదుడు
- 2026 జనవరి వరకు ఇదే పరిస్థితి
- ట్రూఅప్ చార్జీలు, ఫ్యూయల్ పవర్ పర్చేస్ అడ్జస్ట్‌మెంట్
- డిసెంబర్‌లో భారీగా పెరిగిన విద్యుత్ బిల్లులు
- రాష్ట్రప్రజలపై రూ.15 వేల కోట్ల భారం మోపిన కూటమి సర్కారు
- ఈ నెల బిల్లు నుంచి రూ.5 కోట్లు భారం


చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సామాన్యులకు విద్యుత్ బిల్లులతో షాక్ తగిలేలా చేసింది. ఈ ప్రభుత్వంలో ఇప్పటికే నిత్యావసర ధరలు అమాంతం పెరగడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఇదే సమయంలో విద్యుత్ బిల్లులు సైతం తడిసి మోపెడవుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ చార్జీలు పెంచమని కూటమి గత ఎన్నికల ప్రచారంలో హామీలు గుప్పించింది. తీరా అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలను గతంలో ఎన్నడూ లేని విధంగా పెంచేశారు. జిల్లావ్యాప్తంగా భారీగా పెరిగిన విద్యుత్ బిల్లులను చూసిన సామాన్యులు షాక్ గురవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అధిక సంఖ్యలో పెరిగిన విద్యుత్ బిల్లులను ఎలా చెల్లించాలో తెలియక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పెరిగిన విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించలేక ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో ఇంత జరుగుతున్నప్పటికీ టీడీపీ కూటమి ప్రభుత్వమేమో తమకేమి పట్టనట్టు మిన్నకుండిపోతోంది.



ఈయన పేరు శివ. జిల్లాలోని గుడిపాల మండలం నరహరిపేట పేటలో నివాసం ఉంటున్నాడు. ఈయన డిసెంబర్‌లో 90 యూనిట్లు విద్యుత్ ఇంటికి వినియోగించగా అందుకు వచ్చిన విద్యుత్ చార్జీ రూ.260 కాగా, అదనపు చార్జీలు రూ.170తో కలిపి రూ.430 బిల్లు వచ్చింది. ట్రూఅప్ చార్జీలు, ఫ్యూయల్ పవర్ పర్చేస్ కార్డు అడ్జస్ట్‌మెంట్ కొత్తగా వేయడంతో బిల్లు దాదాపు రెట్టింపైంది. గతంలో ఈయనకు నవంబర్ నెలలో కరెంటు బిల్లు రూ.250 లోపే వచ్చేది. హఠాత్తుగా ఇంత మొత్తంలో అదనపు బిల్లు రావడంతో శివ గగ్గోలు పెడుతున్నాడు.

జిల్లాలో అన్ని సర్వీసులు 5.61 లక్షలు

జిల్లావ్యాప్తంగా గృహ, వాణిజ్య సర్వీసులు 5.61 లక్షల సర్వీసులు ఉన్నాయి. జిల్లాలో ఇంధన సర్దుబాటు చార్జీల రూపంలో రూ.5 కోట్లు అదనపు బాదుడు వేస్తున్నారు. ఏప్రిల్ 2022–మార్చి 23 వరకు వాడిన యూనిట్ల సర్దుబాటు చార్జీలను ప్రతినెల 0.60–0.83 పైసల చొప్పున బిల్లుల్లో సర్దుబాటు చేస్తున్నారు. ఈ భారాన్ని నవంబరు 2024–2026వ సంవత్సరం జనవరి వరకు వినియోగదారుల నుంచి వసూలు చేయడానికి కూటమి సర్కారు ఆదేశాలు జారీచేసింది. ఈ అదనపు భారం గృహ, వాణిజ్య సర్వీసులపై ప్రభావం చూపనుంది. దాదాపు ప్రతి సర్వీసుకు రూ.30 నుంచి రూ.500 వరకు అదనంగా వస్తోంది.



BILL NO
NAME S SHAHEENA
USC NO 5112402008564
Aadhar Number XXXXXXXX2253
Mobile Number XXXXXX0000
SECTION KONGAREDDI PALLI
Bill Method IrDA
METER NO 32941766
DTR Code 30511143018
POS DOMESTIC (A)
CAT:LT1 SUB CAT:0 PH :1
CONTRACTED LOAD
BILL PERIOD 02.11.24 01.10.24
PRESENT PREVIOUS
MTR STATUS 01 01
KWH 10758.0 10670
TrueUp Charges(28/36) 41.89
AP GOVT SUBSIDY 0.00
Loss/Gain (+ / -) -0.47
BILL AMT Rs.385.00
ARREARS 0.00
TOTAL DUE Rs.385.00

నవంబర్ నెలలో ఇచ్చిన బిల్లు



BILL NO5111380212172003112224
NAME S SHAHEENA
USC NO 5112402008564
Aadhar Number XXXXXXXX2253
Mobile Number XXXXXX0000
SECTION KONGAREDDI PALLI
Bill Method IrDA
METER NO 32941766
DTR Code 30511143018
POS DOMESTIC (A)
CAT:LT1 SUB CAT:0 PH :1
CONTRACTED LOAD
BILL PERIOD 02.12.24 02.11.24
PRESENT PREVIOUS
MTR STATUS 01 01
KWH 10832.0 10758
FPPCA(2022_04) 368.50
FPPCA(2024_10) 35.20
OTHER CHARGES 0.00
ADJUSTMENTS 0.00
TrueUp Charges(29/36) 41.89
AP GOVT SUBSIDY 0.00
Loss/Gain (+ / -) -0.03
BILL AMT Rs.679.00
ARREARS 0.00
Rs.679.00

డిసెంబర్ నెలలో ఇచ్చిన బిల్లు

వినియోగం తక్కువ బిల్లు ఎక్కువ..



నగరానికి చెందిన శాంతి 3506 సర్వీసు నంబర్ నివాసంలో ఉంటున్నారు. ఆమె ఇంట్లో రెండు ఫ్యాన్లు, మూడు ట్యూబ్ లైట్లు, టీవీ మాత్రమే ఉన్నాయి. పిల్లలు ఉదయం పనికి వెళ్లి తర్వాత రాత్రి ఇంటికి వస్తారు. గత నెలలో మొత్తం 221 యూనిట్లు వాడకం జరిగిందని, బిల్లు మొత్తం రూ.1163 వచ్చింది. ఇందులో విద్యుత్ వాడకం కింద రూ.993, మిగిలిన రూ.167 ఇతర చార్జీల కింద వసూలు చేస్తున్నారు. ఇందులో కొత్త ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో సెప్టెంబర్ 2024లో వాడిన విద్యుత్ యూనిట్లకు రూ.86 అదనంగా వడ్డించారు. ఫిక్స్‌డ్ చార్జీలు రూ.20, కస్టమర్ చార్జీలు రూ.50, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.13 వచ్చింది. ఈ నెలలో వచ్చిన బిల్లులో 210 యూనిట్లకు గాను రూ.1238 బిల్లు వచ్చింది. గత నెల కంటే తక్కువ యూనిట్లు వాడినా.. ఎందుకు అంత బిల్లు వచ్చిందని పరిశీలించగా, గతనెలలో వచ్చిన బిల్లుకు అదనంగా మరో సర్దుబాటు ప్రభుత్వం వడ్డించింది. 2022 ఏప్రిల్ నెలలో వాడిన విద్యుత్ యూనిట్లకు సర్దుబాటు పేరుతో రూ.202 అదనంగా వడ్డించారు. యూనిట్‌కు 61 పైసలు చొప్పున వీటిని వినియోగదారుల పై వేశారు.

జిల్లాపై భారం రూ.5 కోట్లు..



జిల్లా వాసులపై ప్రభుత్వం రెండోసారి విద్యుత్ చార్జీల భారం వేసింది. ఇంధన సర్దుబాటు చార్జీలు (ఎఫ్‌పీపీసీఏ)పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజల నుంచి వసూలు ప్రారంభించింది. ప్రతి యూనిట్‌కు 61 పైసలు చొప్పున అదనపు భారం మోపుతోంది. 2022 ఏడాది ఏప్రిల్ నెలలో వాడిన విద్యుత్ యూనిట్లకు సంబంధించి ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో ఈనెల నుంచి వసూలు ప్రారంభించింది. ఒక్కో యూనిట్‌కు రూ.1.21 చొప్పున వసూలు చేయాలని నిర్ణయించారు. అయితే ఇది ఎక్కువ మొత్తం అవుతుందని భావించి దొడ్డిదారి ప్రయత్నాలను అమలు చేస్తున్నారు. ఈ అదనపు చార్జీలను రూ.1.21 ఒకేసారి కాకుండా, ఈనెల 61 పైసలు, మరో నెల 60 పైసలు చొప్పున దానిని విడగొట్టింది. దీంతో ఈనెల బిల్లులో 2022 ఏప్రిల్ నెలలో వాడిన విద్యుత్ యూనిట్లకు సంబంధించి యూనిట్‌కు 61 పైసలు చొప్పున ఈ డిసెంబర్ బిల్లులో వినియోగదారులపై అదనపు భారం వేశారు. యూనిట్‌కు 61 పైసలు చొప్పున జిల్లా పరిధిలో ఈనెల అదనంగా రూ.5 కోట్లకు పైగా వసూల్ చేస్తున్నారు. తర్వాత నెల 60 పైసలు చొప్పున దాదాపు రూ.4.90 కోట్లు పైగా వసూలు చేయనున్నారు. మొత్తం జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రజలపై ఎఫ్‌పీపీసీఏ పేరుతో రూ.13.90 కోట్లు భారం కూటమి ప్రభుత్వం మోపింది. 2024 అక్టోబర్ నెల నుంచి వస్తున్న సర్దుబాటు చార్జీలకు ఇవి అదనం. జిల్లాలో ప్రతినెల రూ.50 కోట్లకు పైగా బిల్లుల రూపంలో శాఖకు ఆదాయం వస్తోంది.

ప్రభుత్వమే భరించాలి



వినియోగదారులపై వేస్తున్న ఇంధన సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలి. కరెంటు చార్జీలను పెంచమని చంద్రబాబు హామీనిచ్చారు. అధికారంలో వచ్చాక కోట్లాది రూపాయాలు ప్రజలపై అదనపు చార్జీల రూపంలో భారం వేస్తున్నారు. జనవరి 2026 వరకు సర్దుబాటు చార్జీల పేరిట ముక్కుపిండి వసూలు చేయనున్నారు. – చైతన్య, నగర ప్రధాన కార్యదర్శి, విద్యుత్ వినియోగదారుల సంఘం

పేదలపై భారం..



విద్యుత్ చార్జీల పేరిట పేదలపై ప్రతినెల అదనంగా వందల్లో భారం వేస్తే భరించేది ఎలా ? మాకు ప్రతినెల కరెంటు బిల్లు రూ.200 వచ్చేది. చలికాలంలో పెద్దగా కరెంటు వాడకపోయిన రూ.400 బిల్లు వచ్చింది. ఇందులో ట్రూఆప్, ఇంధన సర్దుబాటు, ఇతర చార్జీలే వందకు పైగా ఉంది. బిల్లు రూ.200 అయితే అదనపు చార్జీల రూపంలో మరో రూ.200 వేస్తే బతికేది ఎలా ?

– రవి, బంగారుపాళ్యం

తెరమరుగు

ఇటీవలి వరకు ప్రతి ఒక్కరికీ వినోదాన్ని పంచిన థియేటర్లు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నాయి. తెరను కారు చీకట్లలా కమ్మేయడంతో థియేటర్లకు కళ తప్పుతోంది. గతంలో నోటిమాటలతో సినిమా వందరోజులు ఆడేవి. ఇప్పుడు మూవీ విడుదలైన కొన్ని గంటలకే సినిమా హిట్టా ..ఫట్టా అని రివ్యూలు ఇచ్చేస్తున్నారు. మరోవైపు పెరిగిన సాంకేతికత వల్ల సినిమా రిలీజైన రోజే పైరసీ ప్రింట్లు వెబ్‌సైట్లలో పెడుతున్నారు. ప్రస్తుతం వారం లేదా రెండు వారాలకు మించి సినిమాలు ఆడట్లేదు. మరోవైపు డిజిటల్ మీడియా అందుబాటులోకి వచ్చాక థియేటర్‌కు వచ్చి సినిమా చూసేవారు తగ్గిపోయారు. కొత్త సినిమాలు రోజుల వ్యవధిలోనే ఓటీటీలోకి వస్తుండడంతో థియేటర్లపై ప్రేక్షకుల ఆదరణ మసకబారుతోంది.

- కళ తప్పిన సినిమా థియేటర్లు
- వంద రోజుల సినిమాలు కరువు
- రెండు వారాలు ఆడితే బొమ్మ హిట్
- రోజుల వ్యవధిలోనే ఓటీటీలోకి సినిమాలు
- రిలీజ్ రోజే వెబ్‌సైట్లలో పైరసీ ప్రింట్లు
- థియేటర్లపై డిజిటల్ మీడియా ప్రభావం
- ఫంక్షన్ హాళ్లుగా మారిన థియేటర్లు

కాణిపాకం: ఒకప్పుడు సినిమా థియేటర్లు మాత్రమే వినోదాన్ని పంచేవి. విరామ సమయాలు, పండుగలు, శుభకార్యాలు, ఇతరత్రా సమయాల్లో ఇంటిల్లిపాది సినిమా థియేటర్ల బాట పట్టేవారు. ముఖ్యంగా కొత్త సినిమాలు, పెద్ద హీరోల సినిమాలు వస్తే థియేటర్ల వద్ద సందడి మాములుగా ఉండేది కాదు. అభిమానులు ఊరూరా పోస్టర్లు అంటించడం, రాత్రి, పగలు కష్టపడి కటౌట్లు, స్టార్, బ్యానర్లు(కాటన్ వస్త్రంపై చేతితో రాసే బ్యానర్లు) థియేటర్ల వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చేవారు. ఫ్యాన్స్ షోకు ముందు అభిమాన హీరో కటౌట్‌కు అభిషేకాలు, పూజలు చేయడం, దిష్టి తీయడం, కొబ్బరికాయలు కొట్టడం, టపాసులు పేల్చి సంబరాలు చేసుకునేవారు. దీంతో థియేటర్లకు ఓ కళను ఉండేది. అభిమానులు చెప్పే నోటి మాటలే ప్రేక్షకులను థియేటర్లకు ఇక బాక్సులు హైదరాబాద్ నుంచి తిరుపతికి వచ్చేవి. సినిమాకు 6, 8, 9 బాక్సులు వచ్చేవి. ఒక్కో బాక్సులో రెండేసి చొప్పున్న రీల్స్ ఉండేది. ఇవి వచ్చేంత వరకు తెరపై బొమ్మ పడేది కాదు. కొత్త సినిమా బాక్సు రావడం ఆలస్యమైతే ఆరోజు థియేటర్ యాజమాన్యం గజగజ వణికిపోయేది. కొన్ని సమయాల్లో హీరో అభిమానులు థియేటర్ల యాజమాన్యాలతో గొడవకు దిగేవారు. గేట్లను ఇరగ్గొట్టి, థియేటర్ తలుపులు బద్దలు కొట్టేవారు. స్క్రీన్‌ను చించేసేవారు. కుర్చీలు పగలగొట్టేవాళ్లు.అయితే థియేటర్‌లో ప్రొజెక్టర్ ఆన్ చేసి.. తెరపై లైటింగ్ పడగానే విజిల్స్ మోగేవి. అప్పట్లో హిట్ టాక్ అందుకున్న సినిమాలు ఏడాది పొడవునా ఆడేవి. ఇదంతా గతం. డిజిటల్ రంగం వచ్చాక థియేటర్ల ప్రాబల్యం తగ్గిపోయింది.

అంతా డిజిటల్ మయం..

టెక్నాలజీ రాకతో అన్ని థియేటర్లు మిషనరీ ప్రాజెక్టర్లను పక్కన పెట్టేశాయి. ఇప్పుడు డిజిటల్ రంగం. యూఎఫ్‌ఓ, క్యూబ్, సోని అనే ప్రాజెక్టర్ సిస్టంలను తీసుకొచ్చి 4కే క్వాలిటీతో సినిమా చూపిస్తున్నాయి. ఇవీ శాటిలైట్ ద్వారా నడుస్తున్నాయి. వీటి దెబ్బకు బాక్సుల్లోని రీల్స్ బద్దలై మూలకు చేరాయి. అయితే మిషనరీ ప్రాజెక్టర్‌లో నిర్వహణా లోపం తక్కువ అని, రూ.10 కార్బన్ వ్యయమని, పన్ను కేవలం 8 శాతమే ఉండేదని థియేటర్ నిర్వాహకులు అంటున్నారు. డిజిటల్ విధానం రాకతో సినిమాకు డబ్బులు కట్టాలి, సిస్టంకు బాడుగలు, పన్ను 18 శాతం వరకు చెల్లించాల్సి ఉందని వాపోతున్నారు. హిట్ సినిమా అయినా వారం, 10 రోజులే ఆడేది. డిజిటల్ సిస్టం, 4కే వీడియో, ఏసీ, లగ్జరీ కుర్చీలు ఇలా అన్ని సౌకర్యాలు ఉన్నా థియేటర్లకు వచ్చేది కష్టమైంది. ప్రతి ఇంట్లోనూ ఇప్పుడు ఆండ్రాయిడ్ టీవీలున్నాయి. ఈ ఫలితంగా ఓటీటీ ద్వారా కొత్త సినిమాలను ఇంటిల్లిపాది వీక్షిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో కొంతమంది ఇళ్లల్లోనే మినీ థియేటర్ ఏర్పాటు చేసుకున్నారు. అలా ఆ థియేటర్‌లో కాలక్షేపం చేస్తూ సినిమాల సరదా తీర్చుకుంటున్నారు. ఫ్యామిలీతో వెళ్లి సరదాగా గడిపేందుకు అద్దెకు లభించే మినీ థియేటర్ హాల్‌ను ఎంచుకుంటున్నారు. ఇలా రకరకాలుగా సినిమా థియేటర్లకు గడ్డుకాలం మొదలైంది.



డిజిటల్ ప్రాజెక్టర్




పాత ప్రాజెక్టర్

ఒకప్పుడు 250 థియేటర్లు..ఇప్పుడు 130

ఉమ్మడి జిల్లాలో 30 ఏళ్ల కిందట చూస్తే 250కి పైగా థియేటర్లు కనిపించేవి. ఒక్కో థియేటర్ 600 నుంచి 900 వరకు సీట్ల సామర్థ్యాన్ని కలిగి ఉండేవి. టెక్నాలజీ దెబ్బకు చాలా థియేటర్ల తలుపులు మూసుకున్నాయి. కొన్ని భూస్థాపితమయ్యాయి. మరికొన్ని కొత్తరూపం దాల్చుకుంటూ కష్టాలను, నష్టాలను అధిగమిస్తూ..తట్టుకుని నిలబడుతున్నాయి. ప్రస్తుతం 300 సీట్ల సామర్థ్యం.. కొత్త హంగులతో కనిపిస్తున్నాయి. ఇలా ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి జిల్లాలో 135పైగా థియేటర్లు ఉన్నాయి. ఈ థియేటర్ల ప్రస్తుతం కళ తప్పి.. ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కొత్త సినిమాలు వస్తే వారం లేదా.. పది రోజులు.. అంతకుమించి అంటే రెండువారాలు మాత్రమే థియేటర్లలో ప్రదర్శితమవుతున్నాయి.



ఆ రోజులే వేరు..



అప్పట్లో సినిమా ఆలస్యమైనా నిలబడి సినిమా చూసినా తర్వాతే ఇంటికి వెళ్లేవారు. వందరోజులు, 200 రోజులు కలెక్షన్లు ఉండేది. థియేటర్లు, అందులో పనిచేసేవాళ్లు బతుకుతున్నారు. ఇప్పుడు ఓపిక చాలా మందిలో లేదు. 10 నిమిషాలు ఉండమని చెప్పిన ఉండట్లేదు. పెద్ద సినిమాలు, హిట్ సినిమాలు 14 రోజులు ఆడుతున్నాయి. అంతా ఫోన్లు, టీవీలు మయం.

– వెంకటేశులు, థియేటర్ నిర్వాహకుడు

ప్రత్యేక శిబిరాలు ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న విభిన్న ప్రతిభావంతుల కృత్రిమ పరికరాల ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరాల్లో పేర్లు నమోదు చేసుకున్న అనంతరం విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన కృత్రిమ పరికరాలను ఉచితంగా అందజేస్తారన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌తో పాటు కృత్రిమ అవయవాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన శిథిలావస్థకు చేరిన పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల భవనాన్ని పరిశీలించి, భవన పునః నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చుడా ఛైర్మన్ కటారి హేమలత, నగర మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌వో మోహన్ కుమార్, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ నాయకులు మురళి పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతుడి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్

సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత తప్పనిసరి

జిల్లావ్యాప్తంగా వేస్తున్న సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2024–25 సంవత్సరానికి గానూ 1,490 సీసీ రోడ్ల పనులు మంజూరు కాగా ఇందులో రూ.2949.15 లక్షలతో 786 పనులు పూర్తి చేశారన్నారు. రూ.2,513.84 లక్షలతో 524 పనులకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేయాలన్నారు. ఐసీడీఎస్ అధికారులతో సమన్వయం చేసుకుని అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలన్నారు.

అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో శ్రీరామ్ ప్రతిభ

పలమనేరు: నియోజకవర్గంలోని గంగవరం మండలం గుండుగల్లు గ్రామానికి చెందిన మోపూరి అశోక్ కుమారుడు మోపూరి శ్రీరామ్ ఢిల్లీలో యూసీమాస్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో ప్రతిభ చాటాడు. ఈ పోటీల్లో 30 దేశాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా శ్రీరామ్ తృతీయ స్థానం కైవసం చేసుకుని జిల్లాకు వన్నె తెచ్చాడు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థి శ్రీరామ్‌ను స్థానికులు, ఉపాధ్యాయులు అభినందించారు.



క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



కన్నీటి పర్యంతమవుతున్న కుటుంబ సభ్యులు

పూతలపట్టు (కాణిపాకం): ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన పూతలపట్టు మండలంలో వెలుగు చూసింది. వివరాలు.. తేనేపల్లి పంచాయతీ బీజీ మిట్టూరు గ్రామానికి చెందిన గణపతిరెడ్డి భార్య అనిత (47) మంగళవారం పొలం వద్దకు వెళ్లి, . ఎంతకీ ఇంటికి రాకపోవడంతో పిల్లలు పొలం వద్దకు వెళ్లారు. అనిత చెట్టుకు ఆనుకుని ఉన్నట్లు కనిపించగా దగ్గరకు వెళ్లి చూస్తే చనిపోయింది. గొంతు కింద రక్తపు గాయాలు ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ ప్రహరీ కూల్చివేత

పలమనేరు: మండలంలోని మొరం పంచాయతీ చిన్నపేట కురప్పల్లి ప్రభుత్వ పాఠశాల ప్రహరీగోడను కొందరు వారి స్వప్రయోజనాల కోసం కూల్చివేసిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న స్కూల్ ప్రహరీని ఎలాగైనా కూలగొట్టాలని పథకం వేసి మరీ రాత్రిపూట జేసీబీతో ధ్వంసం చేశారు. దీనిపై స్థానిక ఎంఈఓను అడగ్గా తనకు ఈ విషయం తెలీదని, విచారిస్తున్నామని తెలిపారు.

నామమాత్రపు బీమా.. కనిపించని ధీమా

రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న నామమాత్రపు బీమా మామిడి రైతులకు ధీమా ఇవ్వలేకపోతోంది. దీని వల్ల తమకు మేలు కలిగేలా లేదనే మాట రైతుల నుంచే వినిపిస్తోంది. పైగా బీమా ప్రీమియం ఎక్కువ కావడంతో చాలామంది మామిడి రైతులు బీమా చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. మరోవైపు ఉద్యానశాఖ అధికారులు మాత్రం బీమా గడువును ఈనెల 31వ తేదీ దాకా పెంచారు. అయితే ఏరకంగానూ ప్రభుత్వం నుంచి మామిడి రైతులకు మేలు కలిగే అవకాశాలు లేకపోవడంతో మామిడి రైతుల్లో నైరాశ్యం కనిపిస్తోంది.

- నైరాశ్యంలో జిల్లా మామిడి రైతులు
- మ్యాంగో బోర్డు ఏర్పాటుపై బడ్జెట్‌లో ప్రస్తావన లేదు
- మరోవైపు మామిడికి గిట్టుబాటు ధరను ప్రస్తావించని ప్రభుత్వం
- రూ.1,750 చెల్లిస్తే నష్టపరిహారం వచ్చేది కేవలం రూ.35 వేలు మాత్రమే
- ప్రీమియం ఎక్కువ కావడంతో ముందుకురాని రైతులు
- ఈనెల 31దాకా గడువు పెంచిన అధికారులు
- దిగుబడి తగ్గితే బీమా రానట్టే
- వాతావరణ ఆధారిత బీమా కావడంతో ఏ యూనిట్ మేరకు తీసుకుంటారనే స్పష్టత కరువు



జిల్లాలో ఎక్కువగా సాగులో ఉన్న తోతాపురి మామిడి(ఫైల్)

పలమనేరు : మామిడి రైతులను ఆదుకునేందుకు రాష్ట్రప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికే వరుస నష్టాలు చవిచూస్తున్న తరుణంలో మామిడి రైతులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా కూడా భరోసా ఇవ్వలేకపోతోంది. పైగా బీమా ప్రీమియం ఎక్కువ కావడంతో రైతులు ముందుకు రావడం లేదు. దీనికితోడు పంట దిగుబడి తగ్గితే కూడా బీమా వర్తించదని అధికారులు చెబుతున్నారు. ఇది కేవలం వాతావరణ ఆధారిత బీమాగా ఉంది. ముఖ్యంగా దీన్ని మండలం యూనిట్‌గానా ? లేక జిల్లా యూనిట్‌గా తీసుకుంటారా ? అనే విషయంపై స్పష్టత కొరవడింది. వాస్తవంగా మామిడి బీమా చేసుకునేందుకు ఈనెల 15వ తేదీ నాటికి గడువు ముగిసింది. వరిపంటకు ఎకరాకు రూ.82 కడితే నష్టపరిహారం రూ.40వేలు, వేరుశనగకు రూ.60 చెల్లిస్తే బీమా రూ.30 వేలుగా ఉంది. అదే మామిడికి మాత్రం రూ.1,750 చెల్లిస్తే నష్టపరిహారం రూ.35 వేలు మాత్రమే. మరోవైపు రైతులను ఆదుకోవడానికి మ్యాంగో బోర్డును ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వం బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తలేదు. ఏటా జ్యూస్ ఫ్యాక్టరీల యజమానులు సిండికేట్ అవుతున్న కారణంగా ధరల పెత్తనం కూడా సిండికేట్ల చేతుల్లోకి వెళ్తోంది. సరుకు ఎక్కువగా ఉన్నప్పుడు ధరల్లో కోత పెడుతున్నారు. ప్రభుత్వం మామిడికి గిట్టుబాటు ధర ప్రకటించకుండా నామమాత్రపు బీమాను అమలు చేస్తోందనే మాట రైతుల్లో వినిపిస్తోంది..

జూలై ఆఖరు దాకా సీజన్...

ఉమ్మడి జిల్లాలో 20 దాకా మామిడి గుజ్జు పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడ పండిన పంటలో 60శాతం జిల్లాతో పాటు పొరుగు రాష్ట్రాల్లోని జ్యూస్ ఫ్యాక్టరీలకు చేరుతోంది. మామిడి కాయలను పల్ప్(మామిడి గుజ్జు) తయారుచేసి ఇతర రాష్ట్రాలకే కాక విదేశాలకు సైతం ఎగుమతులు చేస్తుంటారు. ఏటా జూన్ తొలివారం నుంచి నుంచి జూలై ఆఖరు, ఆగస్టు తొలివారం దాకా ఇక్కడ సీజన్ నడుస్తుంది. తోతాపురి రైతులు సీజన్ లాస్ట్ దాకా వేచి ఉంటూ ఎక్కువ ధర కోసం కాయలను చెట్లలోనే ఉంచుకుంటున్నారు. అయితే బీమా గడువు మే 31 దాకానే వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఆపై తోటల్లో కాయలకు నష్టం వాటిల్లితే రైతులకు బీమా రాదు. దీంతో చెల్లించిన ప్రీమియం సైతం దండగా మారుతుంది.

ఉమ్మడి జిల్లాలో మామిడి సాగు ఇలా

జిల్లాలో మామిడి సాగు 1.12 లక్షల హెక్టార్లు
మామిడి రైతులు దాదాపుగా 60 వేలదాకా
ప్రధాన వెరైటీలు: తోతాపూరి, నీలం, ఖాదర్
జిల్లాలో తోతాపురి సాగు: 68వేల హెక్టార్లు
ఏటా పంట సాధారణ దిగుబడి: 8 లక్షల టన్నులు

పంటనష్టాన్ని ఎలా అంచనా వేస్తారో?

పంట నష్టాన్ని మండలం యూనిట్‌గానా లేదా జిల్లా యూనిట్‌గా తీసుకుంటారా ? అనే విషయంపై స్పష్టత లేదు. కేవలం అప్పటి వాతావరణ పరిస్థితులను బట్టి మాత్రమే పరిహారం అందే అవకాశం ఉంటుంది. పోనీ అది అయినా సాంకేతికంగా ఎలా అంచనా వేస్తారనే వివరణ లేదు. జనవరి నుంచి మార్చి15 లోపు ఎండల కారణంగా పంట దెబ్బతింటే, మార్చి 1నుంచి మే 31 వరకు గాలుల కారణంగా పంటకు నష్టం వస్తేనే బీమాకు అర్హులని జీవోలో పేర్కొన్నారు. బీమా అమలులో ఉన్న సమయంలో మండలాల వారీగా వర్షాలు, గాలులు, ఉష్ణోగ్రతల్లో మార్పులు వేరువేరుగా ఉంటాయి. అలాంటపుడు మండలాన్ని యూనిట్‌గా తీసుకోవడం మేలని రైతులు అంటున్నారు. గాలిలో తేమశాతం, వర్షపాత వివరాలను ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ వాతావరణ పరికరాలతో గుర్తిస్తే.. బీమా కోసం నిర్దేశించిన పరిమాణాలు ఉంటేనే బీమా వస్తుందని చెబుతున్నారు. దీనిపై సామాన్య రైతులకు అర్థం కాని పరిస్థితి నెలకొంది.

మా చేతుల్లో ఏమీ ఉండదు..



“ మామిడి బీమాకు సంబంధించి ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాల మేరకు బీమా వర్తిస్తుంది. ఇది పాలసీమ్యాటర్ గనుక మా చేతుల్లో ఏమీ ఉండదు. మామిడి బీమా ప్రీమియం గడువును ఈనెల 31 దాకా పెంచారు. మామిడి రైతులు బీమా చేసుకోవాలని సూచిస్తున్నాం.

– లక్ష్మీప్రసూన, హార్టికల్చర్ ఆఫీసర్, పలమనేరు

గిట్టుబాట ధర ప్రకటించాలి



మామిడి మ్యాంగోబోర్డును ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరను కల్పిస్తామన్న ప్రభుత్వం ఈ దఫా కూడా ఆ విషయం పట్టించుకోలేదు. మరోవైపు మామిడిబీమా ప్రీమియం ఎక్కువ.. పరిహారం తక్కువగా ఉంది. నష్టపరిహారం కచ్చితంగా వస్తుందనే నమ్మకం కల్పించడం లేదు. మే 31తో బీమా గడువు ముగుస్తుంది. గడువును పెంచితే రైతులకు మేలు.

– నియాజ్, మామిడి రైతు, పలమనేరు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ..

యువతను మోసం చేసిన దంపతుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళెం: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగ యువతను మోసగించిన దంపతులను మంగళవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. వివరాలు ఇలా.. బంగారుపాళెం మండలం నల్లంగాడు కోటూరులో చెరుకూరి పావని(28) భర్త నంతకుమార్(32)తో కలిసి నివాసం ఉంటోంది. ఇందులో నంతకుమార్‌ది తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా తేంద్రంబట్టు తాలూకా కీల్‌సిరుపాక్కం స్వగ్రామం . అయితే పావనిని వివాహం చేసుకుని ఇక్కడే ఉంటున్నాడు. వీరిద్దరూ కలిసి పలు కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశావహులైన స్థానిక యువతీ, యువకుల నుంచి రూ.45 లక్షలు తీసుకుని మోసగించారన్నారు. మండలంలోని ఎన్.కోటూరు గ్రామానికి చెందిన యవకుడు కే.భరత్ అక్టోబర్ 7వ తేదీన తమకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ మేరకు పావని, నంతకుమార్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు. విచారణలో 20 మంది వరకు బాధితులు ఉన్నట్లు తేలిందని సీఐ శ్రీనివాసులు తెలిపారు.

పకడ్బందీగా డిపార్ట్‌మెంట్ పరీక్షలు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో డిపార్ట్‌మెంట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు డీఆర్‌ఓ మోహన్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో డిపార్ట్‌మెంట్ పరీక్షల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 2 పరీక్ష కేంద్రాల్లో ఈ నెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రానికి సరిహద్దులో ఉన్న ఆర్‌వీఎస్ నగర్ వద్ద ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాల, పలమనేరు వద్ద ఉన్న మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 గంటల 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఒరిజనల్ గుర్తింపు కార్డు తీసుకురావాలని, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారా ?





ర్యాంప్ కూల్చివేసిన ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ నేతలు, గ్రామస్తులు (ఇన్‌సెట్) ఇంటి ముందు అంటించిన నోటీసులు

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతిపక్ష పార్టీ వారిపై వేధింపులు
- దామరపాకంలో వైఎస్సార్‌సీపీ నేత ఇంటి ర్యాంప్ కూల్చివేసిన అధికారులు
- అధికారులపై నేతలు, గ్రామస్తుల ఆగ్రహం

నగరి : ప్రభుత్వ అధికారులు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టుకుని, మంత్రి లోకేష్ రాసిన రెడ్‌బుక్ రాజ్యాంగాన్నే అనుసరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. మంగళవారం నగరి మండలంలోని దామరపాకం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత గణపతిశెట్టి ఇంటి ముందు ర్యాంప్‌ను అధికారులు కూల్చివేశారు. ఈ సంఘటనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలతో పాటు గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపై గణపతి శెట్టి ఇంటి వద్దకు చేరుకుని మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన రోజే స్థానిక టీడీపీ నేతలు గణపతిశెట్టి ఇంటిపై రాళ్లతో దాడి చేశారన్నారు. అంతటితో ఆగక ఆయన కుమారుడు లీలారామ్‌ను, అతనితో పాటు ఉండే స్థానిక యువకులను పలుమార్లు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉంచి పంపుతున్నారన్నారు. మంగళవారం కూడా వారిని స్టేషన్‌కు పిలిపించి అక్కడే పెట్టి, గ్రామంలోకి వచ్చిన అధికారులు తహసీల్దార్, ఎంపీడీఓ, సీఐలు 9వ తేదీతో ఉన్న నోటీసును మంగళవారం గోడపై అంటించి వీధిలో నిర్మించారంటూ ర్యాంప్‌ను కూల్చివేశారన్నారు. నగరి చరిత్రలో గతంలో ఎప్పుడూ ఇలాంటివి జరగలేదని, గ్రామమంతా సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలి గానీ ఒక్క ఇంటికే తొలగించడం రాజకీయ కక్ష సాధింపు కాదా ? అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కన్నియప్ప, స్థానిక నాయకులు హరిరెడ్డి, ఉమాపతి, డేనియల్, విజయ్‌రెడ్డి, గురుమూర్తి, మహేష్, తరుణ్, లారెన్స్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం
- నిధులను పారదర్శకంగా వెచ్చించండి
- జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్



ఉద్యానవన శాఖ పరికరాలను రైతులకు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల: గ్రామాల అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని, రానున్న రోజుల్లో వీటిని అమలు చేసేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం కాణిపాకంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఎమ్మెల్యే మురళీమోహన్ అధ్యక్షతన నిర్వహించిన పూతలపట్టు నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక సమీక్షా సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని ప్రతి గ్రామంలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడంలో భాగంగా ప్రణాళికలను సిద్ధం చేయాలని తెలిపారు. ప్రతి పైసాను పారదర్శకంగా వెచ్చించి, ప్రజలకు అవసరమైన వసతులను కల్పించేందుకు కృషి చేయాలని ఆ దిశగా అధికారుల పనితీరు ఉండాలని ఆదేశించారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి గ్రామాన్ని సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే గోకులం షెడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టండి

నియోజకవర్గంలో ప్రధానంగా మామిడి పంట ఎక్కువగా సాగులో ఉందని, దీనికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ప్రధానంగా కుప్పం, పలమనేరులో మల్చింగ్ పద్ధతిలో అధునాతన పద్ధతులను వినియోగిస్తూ కూరగాయల పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ పద్ధతిని నియోజకవర్గంలో కూడా అనుసరించేలా అధికారులు కృషి చేయాలన్నారు. అలాగే హౌసింగ్‌కు సంబంధించి ఎంపీడీఓలు పల్స్ డిమాండ్ సర్వేని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఉద్యాన శాఖ, ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ శాఖల ఆధ్వర్యంలో పలువురు రైతులకు సబ్సిడీ డ్రిప్, స్ప్రింకర్ పరికరాలను వారు పంపిణీ చేశారు.

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకుంటాం..

ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో విజన్ ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ పద్మనాభం, జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పీఆర్ ఎస్ఈలు విజయ్‌కుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి, డీపీఓ సుధాకర్, డ్వామా పీడీ రవికుమార్, పీఓ సాంబశివారెడ్డి, డీఈఓ వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ రెడ్డి, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, ఏపీఎంఐపీ, పశుసంవర్ధక శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పరీక్షలు పూర్తయిన వెంటనే మూల్యాంకనం



ఆర్జేడీని సత్కరిస్తున్న ఎంఈఓలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నిర్వహిస్తున్న సమ్మెటివ్ 1 పరీక్షలు పూర్తయిన వెంటనే మూల్యాంకనం చేపట్టాలని వైఎస్ఆర్ కడప జిల్లా ఆర్జేడీ శామ్యూల్ అన్నారు. మంగళవారం ఆయన డీఈఓ కార్యాలయం తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని గాండ్లపల్లి మున్సిపల్, గంగాధరనెల్లూరు హైస్కూళ్లలో సమ్మేటివ్ పరీక్షల తీరును పర్యవేక్షించినట్లు తెలిపారు. అలాగే సంబంధిత సబ్జెక్టుల టీచర్లు తప్పనిసరిగా జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి, ప్రభుత్వం జారీచేసిన ప్రొగ్రెస్ కార్డుల్లో మార్కులను నమోదు చేసి ఆన్‌లైన్‌లో సైతం అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. పూర్వపు డీఈఓ దేవరాజుపై వచ్చిన అభియోగాలు, డీఈఓ కార్యాలయంలోని పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌కు నివేదికలు ఇస్తామని ఆర్జేడీ వెల్లడించారు. అనంతరం పలువురు ఎంఈఓలు, జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం ఆర్జేడీని కలిసి పలు అంశాలపై చర్చించి, దుశ్శాలువతో సన్మానించారు.

అట్టహాసంగా ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్

– కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియ



వాలీబాల్ విజేతగా నిలిచిన పలమనేరు పాలిటెక్నిక్ కళాశాల జట్టు

పలమనేరు: ఏపీ సాంకేతిక విద్యాశాఖ పాలిటెక్నిక్ విద్యార్థులకు ఏటా నిర్వహించే ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ స్థానిక బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎస్వీయూ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ నిర్మల్‌కుమార్‌ప్రియ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గెస్ట్ హానర్‌గా కదిరి పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ రమ హాజరుకాగా స్థానిక కళాశాల ప్రిన్సిపల్ డా.మహమూద్ జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఇందులో 12 పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 175 మంది క్రీడాకారులు వాలీబాల్, ఖోఖో, టీటీ, బ్యాడ్మింటన్, చదరంగం, పరుగుపందేలు, హైజంప్, లాంగ్‌జంప్ తదితరాల్లో పాల్గొన్నారు. ఇక్కడ గెలుపొందిన జట్లు ఈనెల 28న వైజాగ్‌లో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నారు. ఆ మేరకు తొలిరోజు పోటీల్లో వాలీబాల్ విన్నర్స్‌గా పలమనేరు, రన్నర్స్‌గా ఎస్పీడబ్ల్యూ తిరుపతి, టేబుల్ టెన్నిస్‌లో సింగిల్స్‌లో విన్నర్స్‌గా రమ్య(ఎస్పీడబ్ల్యూ తిరుపతి), డబుల్స్‌లో ఎస్పీడబ్ల్యూ తిరుపతికి చెందిన రమ్య, చరితా రెడ్డి నిలిచారు. ట్రిపుల్ జంప్, లాంగ్‌జంప్‌లో షణ్ముఖప్రియ(ప్రభుత్వ పాలిటెక్నిక్, చంద్రగిరి), షాట్‌పుట్‌లో ఇందుప్రియ(కుప్పం) విజేతలుగా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి సహాయ సహకారాలను అందించిన నియోజకవర్గ ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల పీడీలను కళాశాల ప్రిన్సిపల్ అభినందించారు. బుధవారం పోటీలు ముగుస్తాయి.

2400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

పుంగనూరు: మండలంలోని పలు ప్రాంతాల్లో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించినట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకిషోర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎక్సైజ్ సీఐలు సురేష్‌రెడ్డి, సతీష్, ఎస్ఐలు అశోక్, వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బందితో కలసి పత్రపల్లెతాండాలో దాడులు నిర్వహించి 2400 లీటర్ల బెల్లం సారా ఊట ధ్వంసం చేశారన్నారు. అలాగే ఇందుకు ఉపయోగించే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సారా తయారీ దారులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సవరణకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల నామినల్ రోల్స్‌లో తప్పిదాల సవరణకు అవకాశం ఉంటుందని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నామినల్ రోల్స్‌లో సవరణలకు ఈ నెల 19వ తేదీ నుంచి 23 వరకు ఆయా స్కూళ్ల హెచ్‌ఎంల లాగిన్‌లలో సవరణలు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశం తప్పితే మళ్లీ అవకాశం ఉండదని, ప్రతి పాఠశాల హెచ్‌ఎం జాగ్రత్తగా మరోమారు విద్యార్థుల వివరాలను పరిశీలించాలని ఆదేశించారు. అపార్ ఐడీలో నమోదు చేసిన అన్ని దరఖాస్తులను మరోసారి క్షుణ్ణంగా తనిఖీ చేపట్టాలన్నారు.

చిన్న ఆలయాల్లో చోరీలు

పలమనేరు: మండలంలోని చిన్న ఆలయాల్లో రాత్రి పూట తాళాలు పగులగొట్టి అమ్మవారి మెడలోని బంగారు తాళిబొట్లు, హుండీలోని నగదును ఎత్తుకెళ్లే చోరీలు ఎక్కువయ్యాయి. గ్రామాలకు దూరంగా ఉండే ఆలయాల వద్ద రాత్రిపూట జనసంచారం లేకపోవడంతో దొంగలు వీటినే టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్నారు. మూడు రోజుల కిందట గోపాలపురం ఆలయంలో మారెమ్మవారి బంగారు తాళిబొట్లు, హుండీలోని రూ.30 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఈ నెలలోనే మండలంలోని ఏడు ఆలయాల్లో ఇదే తరహా చోరీలు జరిగాయి. పలు గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల్లో అర్ధరాత్రి బైక్‌లపై తలకు మంకీక్యాప్‌లు పెట్టుకున్న వ్యక్తులు ఆలయాల వైపు వెళ్తున్న ఫుటేజీలను సేకరించి పోలీసులకు అందజేశారు. ఆయా గ్రామస్తులు ఆలయాల్లో చోరీలపై పోలీసులకు ఫిర్యాదులు సైతం చేస్తున్నారు. ఈ చోరీలకు సంబంధించి పోలీసులు ఓ దొంగను ఇప్పటికే పట్టుకున్నట్టు సమాచారం. ఆలయాల్లో వరుస చోరీలపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పూడుపాము విక్రయ ముఠా అరెస్టు

చిత్తూరు కార్పొరేషన్: పూడుపామును పట్టి అమ్మకానికి పెట్టిన ముఠాను అటవీశాఖ సెంట్రల్ విజిలెన్స్ అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అధికారులకు అందిన సమాచారం మేరకు కొందరు పూడుపాములను విక్రయించడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలుసుకున్నారు. అధికారులే బయ్యర్(కొనుగోలుదారులు)గా వ్యవహరించి ముఠాను సంప్రదించారు. పూడుపాము విక్రయించే వారిని నగరంలోని ఓ హోటల్‌కు రప్పించారు. మాటల్లో పెట్టి పూడుపాముతో పాటు గుడిపాల 190–రామాపురం నుంచి ఒకరిని, నగరానికి చెందిన మరొకరిని, పీలేరుకు చెందిన ఇద్దరిని, దామలచెరువుకు చెందిన ఒకరిని కలిపి మొత్తం ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని ఈస్ట్ రేంజ్ కార్యాలయానికి తీసుకెళ్లి విచారిస్తున్నారు. రెండురోజుల్లో పూర్తి వివరాలను వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.